# దొరవారి దర్శనమయింది!

"పొద్దున్నే తగలడ్డావు, నీకేం పనిలేదటయ్యా" అన్నాడు కలెక్టరేట్ ప్యూను వెంకటయ్య, సీనయ్యను చూసి. ఆ దరిద్రపు ముఖాన్ని ఎప్పుడుచూసినా అతనికి కడుపులో దేవి నట్టుంటుంది.

"దొరవారి దర్శనం చేసుకుందామని వచ్చాను" జవాబిచ్చాడు సీనయ్య.

సీనయ్య ముఖం వెంకటయ్యకు చిరపరిచితమే. ఎన్నోసార్లు వచ్చాడతను. ఈ మధ్య మరీ రోజు విడిచి రోజు వస్తున్నాడు. అయ్యగారికెన్ని పన్లు! ఈ అమాంబాపతుగాళ్ళని చూట్టమేనా ఆయన పని!

వెంకటయ్య ఏం మాట్లాడకపోయినా నొచ్చుకోలేదు సీనయ్య.

"ఏం పెద్ద దొరవారు రాలేదా?" అనడిగాడు.

ఇంగ్లీషువాడి పుణ్యమా అని కలెక్టరు దేవుళ్ళు భారతదేశంలో వెలిశారు. జిల్లాలో పనులన్నీ సక్రమంగా జరిపించడానికి ప్రభుత్వానికి కలెక్టరే దిక్కు. దేవుళ్ళు ఎక్కడో కొండలపైన నెలకొని ఉంటారు. సీనయ్య లాంటి బడుగు మనుషులకు ఎప్పుడో కాని దర్శనమివ్వరు. పూజారులే నయం! కసురుకోటానికయినా, విసుక్కోటానికయినా నోరు విప్పుతుంటారు. కానుకలు సమర్పించుకోలేని సీనయ్యంటే అసహ్యం వెంకటయ్యకు.

"ఆఁ, ఆయనకేం పనిలా? నువ్వు వచ్చావని ఆయన పొద్దున్నే నీ కోసం వస్తారు!" అన్నాడు వెంకటయ్య కోపంగా.

"ఎందుకయ్య అంత కోపం?నా బాధనాది. పోనీ చిన్న దొరవారు వచ్చారా?"

"సబ్ కలెక్టరు దొరగారు కాంపు మీద ఉన్నారు. నాలుగు రోజుల దాకా రారు."

సీనయ్యకేం చెయ్యాలో తోచలేదు. కలెక్టరు దొరగారు ఎప్పటికయినా రాకపోతారా అని కలెక్టరేటు ఆఫీసులో ముందు వరండాలోని బల్లమీద కూర్చున్నాడు. తల పైకెత్తి చూస్తే సూరీడు కళ్ళల్లో పొడుస్తున్నాడు. పన్నెండు గంటలయినా అయి ఉంటుంది.

ఒంట్లో నీరసంగా ఉంది. 'ఈ చక్కెర వ్యాధి ఒకటి! తన ప్రాణం తీస్తోంది' అనుకున్నాడు సీనయ్య. 'పొద్దునేమన్న నాస్తా చేసి వస్తే బాగుండేది. ఇంట్లో మిగిలిన గోధుమపిండితో ఐదారు రొట్టెలు పెళ్ళాం చేసింది. కానీ అవి పిల్లలకే చాలలేదు. ఇంక అందులో తినటానికి తనకేం మిగలలేదు. కాని పుండు సలుపు తోంది. ఇవాళ పెద్ద దొరవారి దర్శనం చేసుకుతీరాలి. లేకపోతే చచ్చిపోవాలి' అని తీర్మానించుకున్నాడు, జేబులో ఉన్న సీసాను తడిమిచూసుకుంటూ సీనయ్య. తండ్రి మాటలు గుర్తుకువచ్చాయి సీనయ్యకు. "ఈ సర్కారోళ్ళ మాటలు నమ్మటానికి ఈల్లేదురా. ఆళ్ళట్టాగే అంటారు, పబ్బం గడుపుకునేదాకా. పనయాక మనం ముకం చూడరు."

సీనయ్యకు తండ్రి అడివయ్య మాటల్లోని సత్యం కొంత మేరకు అవగతమే. ప్రభుత్వం రాతిబండనీ, ప్రజల గోడు పట్టించుకోదనీ తెల్సు. కానీ ప్రభుత్వానికున్న సత్తా కూడా తెల్సు అతనికి. తాను కాదంటే బలవంతంగానయినా తమ స్థలం తీసుకుంటారు. రూల్సు అలా ఉంటాయంట! తండ్రికి చెప్పినా ఆ మాట అర్థంకాదు.

అడివయ్యకు ఊరి మధ్యలో ఇళ్ళ స్థలముంది. పిల్లలకు అక్కడ బడి కడితే అందిరికీ ఉపయోగమని పంచాయితీ భావించి రెవెన్యూ డిపార్టమెంటుకు తెలియబర్చింది. కలెక్టరు చంద్రప్రకాశ్ కూడా వచ్చారు. ఆయన జిల్లాను అభివృద్ధి చేయాలని తాపత్రయ పడే మనిషి. స్కూలు కట్టడానికి అది అనువయిన స్థలమని ఆయనకూ అన్పించింది. ఇంకేం స్థలం యజమాని అడివయ్యను సంప్రదించారు. అడివయ్య ససేమిరా తన స్థలం ప్రభుత్వానికి అప్పజెప్పటానికి అంగీకరించలేదు. పంచాయితీ మెంబరు, రెవెన్యూ ఇన్‌స్పెక్టరు, డిప్యూటీ కలెక్టరు, చివరకు కలెక్టరు కూడా నచ్చజెప్పడానికి ప్రయత్నించారు.

"నీ స్థలానికి బదులుగా వెరే చోట రెండెకరాల స్థలం కేటాయించే పూచీ నాది. జనం బాగుకోసం నువ్వీమాత్రం త్యాగం చెయ్యాలి. పిల్లలు చదువుకోవాలి. అందుకు స్కూలుండాలి. రేపు నీ పిల్లల పిల్లలు చదువుకోవాలన్నా, పైకి రావాలన్నా స్కూలు లేకపోతే ఎలా! ఆలోచించుకో, నిన్నడక్కుండానే ఆ స్థలం తమదనే అధికారం ప్రభుత్వానికుంది. కానీ, పెద్దవాడివి – నీ మనసు కష్టపెట్టడం నాకిష్టంలేదు. నువ్వు ఇష్టపడియిస్తే మాకూ సంతోషంగా వుంటుంది" అని చెప్పారు కలెక్టరు గారు. ఆ మాటలతో సీనయ్య ఎంతో ఉత్సాహం కనబరిచాడు. 'తన తండ్రి చదువుకోలేదు. ఆయనకు ఆ అవకాశాలులేవు. తనకు చదువు ఒంటబట్టలేదు. పొలంలో మట్టి పిసుక్కుంటూనే జీవితం గడిపారు. బడి కడ్తే ఊరి పిల్లల భవిష్యత్తు బాగుంటుంది. ఆ మంచి పనిలో తామూ చేయి వేయాలి. ప్రభుత్వమెలాగూ తాము నష్టపోయే స్థలానికి ఇబ్బడిగా వేరే చోట స్థలం కేటాయిస్తా

మంటోంది.' కొడుకు గట్టిగా చెప్పాక, ముసలాయనేం మాట్లాడలేకపోయాడు. తన స్థలం స్కూలు నిర్మాణానికి రాసిచ్చాడు.

స్కూలు భవనానికి పునాది వేస్తున్నప్పుడు సభ జరిగింది. స్వయంగా కలెక్టరు దొర చంద్రప్రకాశ్ వచ్చాడు. అడివయ్యను వేదిక మీదికి పిల్చారు. ఘనంగా సన్మానించారు. అంతే ఆ తర్వాత ప్రభుత్వం అడివయ్యను మర్చిపోయింది. కానీ వాళ్ళవి మర్చిపోలేని బతుకులు. ఒకప్పుడు, అడివయ్య స్కూలుకిచ్చిన స్థలం చెరువు పక్కనే ఉండేది. ఆ ఎకరం పొలంలో వ్యవసాయం చేసుకునేవాడు అడివయ్య. చెరువు పూడ్పించి అక్కడ భూమిని ఇళ్ళ స్థలాలకు కేటాయించడంతో అడివయ్య పొలం కూడా ఇళ్ళ స్థలమయింది. చెరువు పూడ్పించవద్దని నెత్తీ నోరూ కొట్టుకున్నా అతడి మాట విన్పించుకున్న నాథుడే లేడు. 'రేపోమాపో చచ్చే ముసలాడికి ఊరి బాగు సంగతేం తెల్సు' అనుకుంది పంచాయితీ. తన స్థలంలో బావి తవ్వించి కూరగాయలు పండించసాగాడు అడివయ్య. చెరువు మాయమయిపోవడంతో భూగర్భజలాలు ఇంకిపోయి, అతని బావి వట్టిపోయింది. కూరగాయల పంట కూడా అంతంత మాత్రమే కొనసాగింది. తండ్రికి చేదోడు వాదోడుగా ఉండటం తప్ప సీనయ్య చేసిందేం లేదు. తన స్థలం పొలంగా ఉన్నప్పుడు తండ్రితో పాటు తనూ సాగుచేసేవాడు. ఊరి పొలాల్లో తనూ, భార్య ఆదిలక్ష్మీ కూలికి వెళ్ళేవాళ్ళు. సీనయ్యకు ఇద్దరు కొడుకులు. పెద్దవాడు సదాశివుడు, రెండోవాడు మారుతి. సదాశివుడు పక్క ఊరు మట్టువాడలో హెచ్చెస్సీ దాకా చదివాడు. మారుతిని కూడా చదివించడానికి ప్రయత్నించాడు సీనయ్య. అయితే అతనికి చదువబ్బలేదు. సదాశివుడికి మట్టువాడ స్కూలు మిల్లులో పని దొరికాక, తమ కాపురం మట్టువాడకు మారుద్దామనుకున్నాడతడు. ఉన్న ఊరిని వదలిపెట్టి వెళ్ళటం ఇష్టంలేదు అడివయ్యకు. తనీ నేలలోనే బూడిదయి పోవాలన్నాడు.

"చెప్పిన మాటిను. ఈడ మనకేముంది! ఇల్లూ, పొలం అమ్మేసుకుని మట్టువాడ వెళ్దాం. అక్కడే నేనేదయినా పని చూసుకుంటాను" అన్నాడు సీనయ్య.

"పొలం అమ్మటానికి వీల్లేదు. కావల్నంటే ఇల్లు అమ్ముకో" అన్నాడు అడివయ్య మొండిగా.

తమ పొలం ఇళ్ళ స్థలంగా మారిన విషయం అడివయ్య ఛస్తే అంగీకరించడు. అందుకే దాని ప్రస్తావన వచ్చినపుడల్లా 'పొలమే'నంటాడు సీనయ్య కూడా.

కొడుకూ, మనవడూ ఎంత నచ్చచెప్పి చూసినా వినలేదు అడవయ్య. గత్యంతరం లేక ఊళ్ళోని గుడిసె ఇంటిని అమ్మేసి అనంతారం నుండి మకాం మట్టువాడకు మార్చారు.

అప్పుడు వాళ్ళ స్థలంలో స్కూలు కట్టే ప్రతిపాదన వచ్చాక, సదాశివుడు తాతమీద మండిపడ్డాడు. "మనమప్పుడే ఆ స్థలమమ్ముకుని ఉన్నట్లయితే ఇపుడీ బాధ తప్పేది కదా! తండ్రీ, కొడుకులు ఏం చేసుకుంటారో చేసుకోండి. నాకేం సంబంధం లేదు" అంటూ...

ప్రభుత్వం వారి హామీ మీద నమ్మకమెప్పుడూ లేదు అడివయ్యకు. తప్పనిసరై స్థలం స్కూలుకిచ్చాక అతనిలో అంతర్మథనం మొదలైంది. తనకు తండ్రి ఇచ్చిన నాలుగెకరాల మాగాణి భూమిలో మిగిలింది ఆ ఒక్క ఎకరమే. కనీసం ఆ ఎకరం పొలమయినా తన కొడుకులకు ఇవ్వలేకపోయాడు. అందుకే ప్రభుత్వం తమ స్థలానికి బదులుగా ఇస్తానన్న 'పొలం' కోసం కనీసం నెలలో రెండు సార్లయినా కలెక్టరు దొరగారిని దర్శించటానికి వెళ్ళేవాడు అడివయ్య. జిల్లా పట్టణం మట్టువాడకు దగ్గరే. ఏడెనిమిది కిలోమీటర్ల దూరం ఉంటుంది. పొద్దున్నే నాస్తా చేసి వెళ్ళి సాయంత్రానికి తిరిగివచ్చేవాడు. చంద్రప్రకాశ్ ఆ జిల్లా కలెక్టరుగా ఉన్నంత కాలం అడివయ్య లోపలికి కబురంపితే, వెంటనే అతన్ని లోపలికి పిలిపించేవాడు.

అడివయ్య రెండోసారి కలిసినపుడు, కలెక్టరు తన క్రింది అధికారులను పిలిచి, "అడివయ్య గారికి ప్రత్యామ్నాయంగా స్థలమిస్తామని మనం ప్రామిస్ చేశాం. ఆ పని ఎంత వరకయింది?" అని అడిగాడు.

చిన్న దొరవారికి ఆ విషయం తెలియదు. ఆఫీసు సూపరింటెండెంటును, యుడిసిని, ఎల్డీసీనీ విచారించాక గానీ తెలియలేదు. ఆ ఊళ్ళోనే అడివయ్యకు అనువయిన స్థలం గుర్తించటానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. రెవెన్యూ ఇన్స్పెక్టరు ఆ పనిమీదే ఉన్నాడు. ఆ గుర్తింపు జరగ్గానే అడివయ్యకి స్థలం కేటాయిస్తారు. కలెక్టరు వెంటనే ఆర్డరు వేశాడు. "రెండు నెలల్లో పని పూర్తిచేసి నాకు రిపోర్టు సబ్‌మిట్‌చెయ్యాలి."

అడివయ్య సంతోషించాడు. పెద్ద దొర గుండె ఉన్న మనిషి. రెండు నెలల్లో తన పనయిపోతుంది అని భ్రమపడిపోయాడు. రెండు నెలలు గడిచాక మళ్ళీ కలెక్టరు దొర వారిని కలిశాడు. వెళ్ళినప్పుడు తెలిసింది – ఆ ఊళ్ళో కేటాయించదగిన ప్రభుత్వ భూములేమీ లేవట! కావాలంటే దేవుడి మాన్యం రెండెకరాలు కౌలు చేసుకోటానికి కేటాయిస్తామన్నారు. కౌలు భూమి స్వంత భూమి కాదు గదా! అందుకే అడివయ్య ఆ ప్రతిపాదన తిరస్కరించాడు.

"పోనీ మట్టువాడలో చూడండి. పొలం దొరక్కపోతే, ఇళ్ళ స్థలమయినా కేటాయించండి" అని ఆదేశాలు జారీ చేశాడు కలెక్టరు చంద్రప్రకాశ్.

అదే చివరిసారి అడివయ్య కలెక్టరు దొరవారిని దర్శించడం. ఆ తర్వాత చంద్ర ప్రకాశ్‌కు హైదరాబాద్ బదిలీ అయింది. అడివయ్యకు ఆ తర్వాత వచ్చిన కలెక్టరును కలిసే అవకాశమే దొరకలేదు. పదిసార్లు కలెక్టరాఫీసు చుట్టూ తిరిగాక అతడికి ఓపిక నశించిపోయింది. అప్పటికే ఎనభై ఏళ్ళుపైబడిన వ్యక్తి. ఎప్పటినుంచో శరీరంలో గూడుకట్టి ఉన్న ఉబ్బసం పట్టి పీడించింది. దగ్గి దగ్గి తన ఆశ తీరకుండానే తీసుకునిపోయాడు అడివయ్య. పోయేప్పుడు ఎలా అయినా ప్రభుత్వం నుండి తమకు రాల్సిన 'పొలం' సంపాదించి మనవళ్ళ కివ్వమని కొడుక్కి చెప్పి మరణించాడు.

తండ్రి అప్పజెప్పిన బాధ్యతను నిర్వర్తించడానికి ప్రయత్నించాడు సీనయ్య. ఊర్నించి వచ్చాక అతనికి పని లేకుండాపోయింది. కూలికెళ్ళినా అంతగా పని చెయ్యలేకపోయేవాడు. యాభై ఐదేళ్ళకే అతనికి చక్కెర వ్యాధి సోకింది. డాక్టరు పరీక్ష చేయించి మందులు రాసిచ్చి, జాగ్రత్తలు చెప్పాడు కానీ, మందులు కొనుక్కోటమే కష్టమైంది అతనికి. ఇలాంటి పరిస్థితిలో తమ బతుకు మరింత దుర్భరమయ్యే పరిస్థితి దాపురించింది సీనయ్యకు. తమ సంసారానికి ఉన్న ఒక్క ఆధారం పుటుక్కున తెగిపోయింది. సదాశివుడు రైలు గేటు దాటుతూ గూడ్సు బండి ఢీ కొనడంతో మరణించాడు. ఆ గూడ్సు బండి అతన్నెలా తాకిందో, అతనెట్లా చూసుకోకుండా వెళ్ళాడో సీనయ్యకిప్పటికీ తెలియని విషయం. అతని బతుకు బుగ్గయ్యే పరిస్థితి వచ్చింది. చెట్టంత కొడుకుపోయాడు. అతడి భార్య, ముగ్గురు పిల్లలు సీనయ్య ఎదాన పడ్డారు. ఏం బెట్టి వాళ్ళని పోషించాలో అర్థంకాని పరిస్థితి. అప్పటిదాకా అల్లరి చిల్లరగా తిరిగిన మారుతి కాస్తంత కుదురుకున్నాడు. గంజిలో మూటలు మోసి కొద్దో గొప్పో సంపాదించసాగాడు. ఆదిలక్ష్మి, కోడలూ కలిగిన లోగిళ్ళలో పనిపాటలకు కుదిరారు. కానీ పట్నం బతుకులో, పెరిగే ధరలలో ఎంతొచ్చినా ఆహుతయేది. తను రైతు. తన భార్యా, కోడలూ అలా పని చేయాల్సిరావటంతో సీనయ్య ఎంతో హృదయ వేదనకు గురయ్యాడు.తనూ కూలికి ప్రయత్నించాడు కానీ, బరువులు మోసే పని చెయ్యలేకపోయాడు. ఒంట్లో సత్తువ లేకపోయింది.

తండ్రిపోయిన ఐదారేళ్ళలో ఎన్నోసార్లు పెద్ద దొరవారి దర్శనార్థం కలక్టరేటుకు వెళ్ళాడు సీనయ్య. కానీ ఆయన్ని కలవటమే కష్టమైంది. అర్జీలిచ్చాడు. అవన్నీ బుట్ట దాఖలయ్యాయి. ఒకసారి అదృష్టవశాత్తూ చిన్న దొరవార్ని కలవగలిగాడు సీనయ్య.

"నీ స్థలమిచ్చి ఎపుడో పదేళ్ళయిపోయిందని చెప్తున్నావు. ఆ ఫైళ్ళన్నీ తీయించాలి, టైము పడుతుంది. నువ్వో నెల రోజుల తర్వాత కనపడు" అన్నాడాయన.

టంచనుగా నెల రోజుల తర్వాతెళ్ళాడు సీనయ్య. చిన్న దొరవారు కాంపులో ఉన్నారంట. పెద్ద దొరవారు ముఖ్యమంత్రితో వీడియో కాన్ఫరెన్స్‌లో ఉన్నారు. ఆయన్ని కలవటానికి వీలుపడలేదు. మరో ఆర్నెల్లకు అదృష్టం బాగుండి చిన్న దొరవార్ని కలిశాడు సీనయ్య.

"నిన్ను ఏప్రిల్‌లో రమ్మంటే ఇపుడు నవంబరులో వచ్చావు. నీ స్థలం గురించి నీకే అంత శ్రద్ధ వుంటే మాకేనా పట్టింది..."

"వచ్చాను దొరా! తమరు కాంపుకెళ్ళినారు..."

"సరే, సరే. సాకులకేం కొదవలేదు. నీ ఫైలింకా చూడలేదు. మరో రెండు వారాల తర్వాత కలువు".

వారాలు, నెలలు, సంవత్సరాలు గడిచాయి. ఎన్ని విడతల జన్మభూములు గడిచాయి. వాళ్ళ చేతా, వీళ్ళ చేతా అర్జీలు రాయించుకుని సమర్పించుకున్నాడు. కానీ ఫైలు గొంగళి ఎక్కడసింది అక్కడే ఉంది.

స్థలం సంగతి దేవుడెరుగు. బతుకు నిత్య పోరాటం. మనవళ్ళు ఎదుగుతున్నారు. వాళ్ళని బడికి పంపించి చదివించక పోతే వాళ్ళ బతుకూ తన బతుకు లాగే అవుతుంది. రైతు బజార్లు ప్రారంభిస్తున్నారని తెల్సి సీనయ్య కూడా కూరగాయల వ్యాపారం మొదలుపెట్టాడు. వాళ్ళనీ, వీళ్ళనీ పట్టుకుని ఓ గుర్తింపు కార్డు కూడా సంపాదించాడు. ఇట్టా వ్యాపారం సాగితే, నోట్లోకి నాలుగువేళ్ళూ వెళ్తాయనుకుంటున్న తరుణంలో రైతుబజారు మట్టువాడ డొంకకు మార్చారు. తనకంతకు ముందు ఉన్న గుర్తింపు కార్డుని అధికారులు రద్దుచేశారు. మళ్ళీ కొత్తకార్డు సంపాదించటమతనికసాధ్యమయింది.

చేతులు తడపకపోతే సీనయ్యకు గుర్తింపు కార్డు రాదు. ఆ డబ్బేమో అతని దగ్గరలేదు.

పరిస్థితి అలా ఉంటే, గంజిలో మూటలు మోసి కాస్తో కూస్తో సంపాదించే కొడుకు మారుతి, పొరుగింటి రత్నాన్ని లేవదీసుకుని ఉడాయించాడు. పెద్ద గలాభా అయింది. రత్నం తల్లిదండ్రులు సీనయ్య ఇంటిమీద పడి నానా రభస చేశారు. "మూటలు మోసి బతికే నీ కొడుక్కు నా కూతురు కావల్సి వచ్చిందంట్రా ముసలోడా! నిన్ను నీ కొడుకునూ నరికిపోగులు పెడతాం" అన్నాడు రత్నం తండ్రి రంకెలేస్తూ...

"మాదీ ఒకప్పుడు బాగా బతికిన రైతు కుటుంబమే. ఇవాల్టికి చెడ్డరోజులు వచ్చి మూటలు మోయాల్సిన గతి పట్టింది, భద్రయ్యా! మాటలు మీరొద్దు" అన్నాడు సీనయ్య.

కొడుకు రత్నాన్ని తీసుకుని లేచిపోయిన సంగతి అప్పుడే ఆ కుటుంబానికి తెలిసింది. సీనయ్య మాటలకు భద్రయ్య వీరభద్రుడే అయ్యాడు. చేతిలో కర్ర విసిరికొట్టాడు సీనయ్య వైపు. సీనయ్య పక్కకు తప్పుకోబట్టి బతికిపోయాడు. లేకపోతే తల పగిలిపోయేది. అయితే, తల కాపాడుకోగలగిన సీనయ్య కాలిని రక్షించుకోలేకపోయాడు. కర్ర కుడిపాదానికి తగిలి గాయమైంది. రక్తం బొట బొటా కారసాగింది. అది చూసి ఆదిలక్ష్మి, కోడలూ పెద్దగా ఆర్తనాదాలు పెడ్తూ ఏడవ సాగారు.

వాళ్ళ గోలకు బస్తీ జనం పోగయ్యారు. ఆవేశంలో ఊగిపోతున్న భద్రయ్యను శాంత పరిచేటప్పటికి వాళ్ళ పుతమారింది. సీనయ్యకూ కోపమొచ్చినా అణచుకున్నాడు. బస్తీ పెద్దలు పంచాయితీ చేశారు. ఇంతయ్యాక ఆ జంటను పట్టుకుని పెళ్ళిచెయ్యటమే మంచిదని తీర్మానించారు. కాసులేని వాడికి తన పిల్లనివ్వటానికి ఇష్టపడక భద్రయ్య గొణిగినా సణిగినా పంచాయితీ తీర్మానానికి తల ఒగ్గక తప్పలేదు. భద్రయ్యే రత్నం, మారుతిల కోసం ఆరా తీశాడు. రెండ్రోజుల్లో యాదగిరిగుట్ట నుండి వాళ్ళని పట్టుకువచ్చారు భద్రయ్య పంపిన మనుషులు.

వాళ్ళని తీసుకువచ్చాక మళ్ళీ పంచాయితీ జరిగింది.

"పెళ్ళి చేసినాక, పిల్లగాడిని మా ఇంట్లోనే పెట్టుకుంటాం. ఇల్లరికమనుకో, ఏమనుకో. మూటలు మోసే పని మాన్పించి వేరే కొలువు పెట్టిస్తా" అన్నాడు భద్రయ్య.

ఆదిలక్ష్మి అందుకు ఒప్పుకోలేదు. కానీ సీనయ్య ఆమె గొంతు నొక్కేశాడు. "నా కొడుకు చేసింది యదవ పని. ఆ తప్పుకు నువ్వెట్టా చెప్తే అట్టా నడుచుకుంటాం, నేనూ, నా కొడుకూ" అన్నాడు సీనయ్య.

"లగ్గమయ్యాక మీకూ మాకు ఏం సంబంధం ఉండకూడదు. కొడుకున్నాడు కదా అని, మీరు మా ఇంటికి రాకపోకలు సాగిస్తే ఊరుకోను."

"నువ్వెట్లా చెప్తే అట్లానే అంటి కదా!"

అలా ఉన్న ఒక్క కొడుకుతో సంబంధం తెగిపోయింది సీనయ్యకు. అతని సంపాదనా పోయింది. కానీ, వియ్యంకుడు కోపంతో కర్ర విసిరినపుడు తగిలిన గాయం మాత్రం మానుపట్టలేదు. పుండయి సలుపుతోంది. చక్కెర వ్యాధి ఉన్నవాళ్ళు గాయమయితే జాగ్రత్తగా ఉండాలి. వెంటనే డాక్టర్ని కలవాలి" అని ఎపుడో పిహెచ్‌సి డాక్టరు చెప్పినమాట గుర్తుకువచ్చింది సీనయ్యకు. వెళ్ళి డాక్టరుకు చూపెట్టుకున్నాడు. డాక్టరు అతన్ని చెడామడా తిట్టాడు.

"మందులు సక్రమంగా వాడాలి. తిండి తగ్గించాలి. శరీరానికి వ్యాయామం ఉండాలని నీకెన్నిసార్లు చెప్పాను. ఇపుడా గాయం మానటంలేదు. షుగరు బాగా పెరిగిపోయింది. గాంగ్రిన్ సెట్ అయిందేమోనని నాకు అనుమానంగా ఉంది" అన్నాడు డాక్టర్.

ఆయన మాటలు అర్థం కాలేదు సీనయ్యకు. "అంటే ఏంది, సారూ?" అనడిగాడు.

"మందులు వాడక పోతే ఏమవుతుంది? కాలు కుళ్ళిపోతుంది. అప్పుడింక కాలు తీసెయ్యక తప్పదు. ఇప్పటికయినా జాగ్రత్త పడు" అంటూ గాయానికి డ్రెస్ చేయించి, ఓ అరపేజీ మందులు రాసిచ్చాడు డాక్టరు.

అవి కొనే డబ్బు సీనయ్య దగ్గరలేదు. తిండి తగ్గించాల్సిన అవసరమే లేదు. పస్తుల బతుకు అతనిది. వ్యాయామానికేం కొదవలేదు. కలెక్టరాఫీసు చుట్టూ తిరుగుతూనే ఉన్నాడు.

కలెక్టరాఫీసు బల్లమీద కూర్చున్న సీనయ్య తన బతుకు మార్గాలన్నీ మూసుకుపోగా ఓ నిర్ధారణ కొచ్చాడు. 'ఇవాళ దొరగార్ని దర్శించక తాను ఇంటికి వెళ్ళడు. లేకపోతే చచ్చిపోతాడు. కాలు తీయించుకుని అవిటి బతుకు తను బతకలేడు. భార్యపై, కోడలిపై తన భారం కూడా పెట్ట లేడు. ఆ కాలు తీయించాలన్నా ఎంత ఖర్చవుతుందో?' కలెక్టరాఫీసుకు రాబోయే ముందే పురుగు మందు సీసా కొనుక్కువచ్చాడు.

ఒంటిగంట అవుతుండగా కలెక్టరాఫీసులో హడావుడి ప్రారంభమయింది.

"ముసలోడా! లే. అయ్యగారు వస్తున్నారు. నిన్ను చూస్తే నన్ను తిడ్తారు. పక్కకెళ్ళి నిలబడు."

కలెక్టరు దొరగారు కారు దిగి, బంట్రోతు ఫైళ్ళతో వెనక నడుస్తుంటే టకటకా మెట్లెక్కి తన కోసం నిరీక్షిస్తున్న జనం వంక పలకరింపుగ నవ్వి లోపలకుపోయాడు. పది నిమిషాలయ్యాక, కలెక్టరు దర్శనార్థం వచ్చిన జనం, తమకున్న పలుకుబడిననుసరించి లోపలకు పోతున్నారు. సీనయ్యకు ఆఫీసు తతంగం బాగా తెల్సు. ఆఫీసులో క్లర్కును తన పేరు ఓ చీటీ మీద రాయమని అర్థించాడు. అతను దయగల మనిషి. ఎపుడు కలెక్టరు గారికి చీటీ పంపినా అతని చేతే రాయించుకుంటాడు. అతనికి మతిమరుపు. ఎన్నిసార్లు రాసినా సీనయ్య పేరూ గుర్తుండతనికి.

"చెప్పు ఏం పేరు?"

"సీనయ్య సార్! సీనయ్యని రాయండి"

"కుంటి 'స'నా మెలిక 'శ' నా"

అదేమిటో అర్థం కాలేదు సీనయ్యకు.

క్లర్కు నవ్వి, "నీకు కుంటి 'స' చాల్లే. డబ్బున్న పెద్దోళ్ళకే మెలిక 'శ'. నీకు మెలికలు తెలియవు కనుకనే ఇన్నిసార్లు కలెక్టరాఫీసు మెట్లెక్కి దిగుతున్నావు. పని మామూలేగా" అని సీనయ్య పేరు, వచ్చిన పని ఓ చీటీ మీద రాసిచ్చాడు.

వెంకటయ్యను బతిమిలాడి ఆ చీటీని లోపలకు పంపాడు సీనయ్య. అయితే, ఎంతకీ అతనికి పిలుపురాలేదు. నిరీక్షించి నీరసించి పోయాడు సీనయ్య. నాలుగ్గంటల సమయంలో మళ్ళీ హడావుడి మొదలయింది. కారు వచ్చి మెట్ల ముందు ఆగింది. దొరవారు ఏదో మీటింగుకు వెళ్ళాలంట. ఆయన పరుగెత్తినట్లు తన ఛేంబర్ నుండి బయటికి వచ్చి, కారెక్కి వెళ్ళి పోయాడు.

వెంకటయ్య "మళ్ళీ అయ్యగారు ఆఫీసుకు వస్తారో, లేదో, రేపు రా పో" అన్నాడు.

సీనయ్య బల్లమీద కూలబడిపోయాడు. అతనికి 'రేపు' లేదు.

అయ్యగారు వెళ్ళిపోయాక, బయటికెళ్ళి తీరిగ్గా చాయ్ తాగి, ఓ సిగరెట్టు తాగుతూ వాళ్ళతో, వీళ్ళతో బాతాఖానీ వేసి ఆఫీసుకొచ్చాక, హాయిగా బల్లమీద పడుకుని ఉన్న సీనయ్యను చూసేటప్పటికీ మండిపోయింది వెంకటయ్యకి. 'అమ్మో! వీడబ్బ సొత్తులాగా ఎంత దర్జాగా పడుకున్నాడు!' అనుకుంటూ లేపాలని వచ్చిన వెంకటయ్య సీనయ్య నోటి నుండి నురగ రావడం చూసి నిశ్చేష్టుడయిపోయాడు. మరుక్షణంలో తేరుకుంటూ పెద్దగా అరిచాడు. "ముసలాడేదో తాగాడు. నురుగులు కక్కుతున్నాడు. చచ్చిపోతూన్నాడు" అంటూ.

అంతే, ఆఫీసు జనం పోగయ్యారు. తర్జనభర్జనలు పడ్డాక పోలీసులను పిలిపించారు. పోలీసులు సీనయ్యను ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ వైద్య సహాయం అందినప్పటికీ సీనయ్య బతకలేదు. సీనయ్య కుటుంబానికి కబురందింది. ఆదిలక్ష్మి, కోడలు, మారుతి గుండెలు కొట్టుకుంటూ ఆసుపత్రికి పరిగెత్తుకొచ్చారు. సీనయ్య శవాన్ని చూసి వాళ్ళ గుండెలవిసిపొయ్యాయి. ఇపుడు సీనయ్య ముఖం ప్రశాంతంగా ఉంది. అతనికింక మానవ సాయం అక్కర్లేదు. పెద్ద దొరవారి దర్శనమూ అక్కరలేదు.

పెద్ద దొరవారు సీనయ్య మరణవార్త విని అతని దర్శనార్థం వచ్చారు. బాధిత కుటుంబానికి సాంత్వన పలికారు. మారుతిని బుజ్జగిస్తూ మాట్లాడారు. "మీ తండ్రిగారు ఇంత ఎక్స్‌ట్రీం స్టెప్ తీసుకోవాల్సింది కాదు. ప్రజల కోసమే ప్రభుత్వం. నీకు ప్రభుత్వం ఉద్యోగం ఇవ్వాలని సిఫారసు చేస్తాను. మీ స్థలం కూడా త్వరలో ఇప్పించే ప్రయత్నం చేస్తాను. దినవారాలయ్యాక నన్ను కలువు"

అంత విషాదంలోనూ మారుతి మనసులో ఆశలు చిగురించాయి. ప్రభుత్వం తన కోసం ఏదో చెయ్యబోతోందనుకున్నాడు. తండ్రి పెద్దకర్మ పూర్తయ్యాక దొరవారిని కలవాలని నిర్ణయించుకున్నాడు. ఆ స్థలం కోసం తాత తిరిగాడు. తండ్రి తిరిగాడు. 'ఏమో తనకి రావచ్చేమో' అన్న ఆశ అతన్ని మళ్ళీ కలెక్టరేట్ చుట్టూ ప్రదక్షిణం చేయించడం మాత్రం ఖాయం.

ఆసుపత్రి నుంచి వెళ్ళబోతూ పెద్దదొర వారు, తన్నుచుట్టుముట్టిన పత్రికా విలేకరులతో మాట్లాడుతూ... "సీనయ్య రైతు బజారు గుర్తింపు కార్డు కోసం తిరుగుతున్నాడని తెలిసింది. కానీ, స్థలం కోసం తిరుగుతున్నాడని తెలియలేదు. మేం ఆయన సమస్యను పరిష్కరించే వాళ్ళం. ఆయన తొందరపడ్డాడు. సీనయ్య మరణానికి అసలు కారణమేమిటో తెలియాల్సి ఉంది. కొంతకాలంగా కుటుంబ సమస్యలతో డిప్రెషన్‌లో ఉన్నట్లు తెలిసింది. షుగర్‌వ్యాధి వల్ల కాలికి గాంగ్రిన్ కూడా ఫాం అయిందట. తీసేయాలని డాక్టర్లు అన్నారట. అవిటి వాడుగా బతకటం ఆయనకిష్టం లేదు. అదే ఈ ఆత్మహత్యకు కారణమనుకుంటున్నాను. ఆయన అంత్యక్రియల కోసం వెంటనే వెయ్యిరూపాయలు మంజూరు చేస్తున్నాం. ఆయన కొడుక్కు ఉపాధి కల్పిస్తాం. ఆయన ఆశించిన స్థలం కూడా వెంటనే మంజూరయ్యేట్లు చూస్తాం" అన్నారు. రిపోర్టర్లు వేసిన ప్రశ్నలకు ఓపిగ్గా సమాధానాలు చెప్పారు.

ఓ రిపోర్టరు అడిగాడు,"ప్రభుత్వ వైఫల్యం వల్లే సీనయ్య ఆత్మహత్య చేసుకున్నా డంటున్నారు" అని.

"అది అబద్ధం. అతని గృహ సమస్యలు, ఆరోగ్య పరిస్థితులే ప్రధాన కారణం."

సీనయ్య అంత్యక్రియలకు మారుతికి వెయ్యి రూపాయలు ఇప్పించి, కలెక్టరు కారులో వెళ్ళిపోయారు.

రాత్రి పదిగంటలయింది. పోస్టుమార్టం చేశాక మర్నాడు కానీ శవాన్ని ఇవ్వరట. సీనయ్య కుటుంబం ఆసుపత్రిలో చెట్ల క్రింద కూర్చుని రోదిస్తోంది.

ఎలా అయితేనేం సీనయ్య కోరిక తీరింది. పెద్దదొరవారిని అతను దర్శించగలిగాడు. ప్రభుత్వ సాయమూ అందింది అతనికి!

విపుల *(మాస పత్రిక, జనవరి, 2006)*